క్లుప్తంగా

పాఠశాలలకు కిట్‌లు పంపిణీ



మాచర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి పాఠశాలకు ప్రత్యేక వాహనాల్లో కిట్‌లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మరో ఆరు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఎంఈవో అల్లి సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షమి, ఉపాధ్యాయులతోపాటు, మండల విద్యా శాఖ రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

20న వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరులో కొలువైయున్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పూజారి చిలకపాటి భరద్వాజ ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి, అలంకరణ, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం చేయనున్నారు. రాత్రి ఆలయం వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పారా హైమావతి పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని, బొల్లా పేరయ్య, దోడ్డా ఏడుకొండలు, పారా చౌదరి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షలో విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): ఏపీ మోడల్ స్కూల్లో ఇటీవల నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలో వినుకొండ మండలంలోని పెదకంచర్ల మెయిన్ పాఠశాలకు చెందిన సనిశెట్టి త్రిలోక్య వైష్ణవి 80 మార్కులతో ప్రథమ ర్యాంక్‌లో సీటు సాధించారని ప్రధానోపాధ్యాయిని పి.శివకుమారి తెలిపారు. అదేవిధంగా సీహెచ్. చరణ్ అనే విద్యార్థి కూడా అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మన గ్రోమోర్ సెంటరులో ఎరువులు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనుకు అనుగుణంగా ఎరువులు కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మన గ్రోమార్ సెంటరు బ్రాంచ్ మేనేజరు చిలకబత్తిని సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రోమార్ సెంటరు నందు బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ వ్యవసాయ పరంగా రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన ఎరువులు, పురుగుమందులు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఎరువులు, పురుగు మందుల అన్నీ సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఎరువులు ఎంఆర్‌పీ ధర, పురుగుమందుల అమ్మకాలు ఆన్‌లైన్ విధానంలో ప్రతిరోజు జరుగుతుందన్నారు. ఒక్కో సంచి యూరియా ధర రూ.266.50 మాత్రమే అన్నారు. ఇందుకుగాను 5 వేల సంచుల నిల్వలు ఉన్నాయన్నారు. ఎరువులు పురుగు మందులు కొరత లేకుండా రైతులు దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి అమ్మకాలు పారదర్శకంగా చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన రైతులు సమగ్ర వివరాలతో కూడిన బిల్లు బయోమెట్రిక్ విధానంలో అందజేయడం జరుగుతుందన్నారు.

పునీత ఆంథోని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి



పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిలో పాల్గొన్న భక్తులు

రెంటచింతల: కథోలికులందరు పునీత ఆంథోని వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అంథోని వారి చర్చి 26వ వార్షికోత్సవం పురస్కరించుకుని సహాయ గురువులు అగస్టీన్, ఫాదర్లు కొణతం ఎలీషా రాజు, రత్నా, పుట్టోట చందు, సాగర్, తంబి, రత్నాకర్, జాకోబురెడ్డిలతో కలసి ఆయన సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పునీత అంథోని వారిని నిండు మనస్సుతో ప్రార్థిస్తే వారి కష్టాలు తొలగిపోతాయన్నారు. సమస్తం త్యజించి లోకరక్షకుడైన ఏసుక్రీస్తు చెప్పిన మార్గంలో జీవించి సువార్తను ప్రకటించి అంథోని వారు పునీతులయ్యారన్నారు. ప్రతి కథోలిక కుటుంబం పునీత అంథోని వారిని పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థించి కరుణ పొంది శారీరకంగాను, మానసికంగాను స్వస్థత పొందాలన్నారు. ఆంథోని వారు అనేక అద్భుతాలతో తనను విశ్వసించిన వారికి తన దీవెనలను అందించారన్నారు. చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆంథోని స్వరూపంతో భక్తి గీతాలు ఆలపిస్తూ మేళతాళాలతో భారీగా బాణసంచా కాలుస్తూ గ్రామ పురవీధులలో ఊరేగింపును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషి


మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్



మాచర్ల: పట్టణంలోని 31 వార్డుల్లో మంచినీటి, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పూర్తి స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఇబ్బంది పడ్డామన్నారు. ఎన్నికలు పూర్తయి, రెగ్యులర్ విధుల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు కలిసి సమష్టిగా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. శనివారం నుంచి ప్రతి వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటామన్నారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్, పారిశుద్ధ్యం, నీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వార్డుల్లో సమస్యలు ఉంటే తమ దగ్గరలోని సచివాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. అక్కడ పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆయా సచివాలయాల్లో ఉన్న సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

ప్రిన్సిపాల్ కె.పాపయ్య



జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో నున్న ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 6 తరగతిలో 35 ఖాళీలు, 7వ తరగతిలో 40 ఖాళీలు, 8వ తరగతిలో 25 ఖాళీలు, 9వ తరగతిలో 35 ఖాళీలు, ఇంటర్ ఫస్టియర్‌లో 30 ఖాళీలు, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 35 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ నంబర్ 9182958496 ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే జూలకంటి విజయోత్సవ ర్యాలీ

కారెంపూడి: మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి విజయోత్సవ సంబరం శనివారం మాచర్ల నియోజకవర్గంలో జరగనుందని మండల టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ఘన స్వాగతం పలకడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వాగత ద్వారాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని పేటసన్నెగండ్ల ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభం కానున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తనను సన్మానించడానికి బొకేలు, పూలదండలు తేవద్దని వాటి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వారు బాగా చదువుకునేందుకు వీలయ్యే కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారని పార్టీ నాయకులు తెలిపారు. కారెంపూడి మండలం నుంచి ప్రారంభం అయ్యే ర్యాలీ మాచర్ల వరకు కొనసాగుతుందని అనంతరం వెల్దుర్తి మండలానికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తరలివెళ్తారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు

రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని రెంటచింతలలోని పలు కాలనీలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలోనున్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, ఎయిర్ కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వారి నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్ కాల్వల్లో వారానికి ఒకసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను, కిటికీలకు మెస్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దోమలను పారదోలడం వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, డి.సీతారామిరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి

మాచర్ల: నియోజకవర్గంలో పాఠశాలల బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ తీసుకోని బస్సులు రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి అన్నారు. శుక్రవారం సాగర్ రోడ్డులోని ఆర్టీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఎక్కువ ప్రైవేటు పాఠశాలల వారు బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు, ఇన్సూరెన్సు, పొల్యూషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, ధ్రువీకరణ పత్రాలు లేకుండా తిప్పినా, మాచర్ల–దాచేపల్లి వరకు తిరిగే వాహనాలు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రవాణా శాఖ అధికారులకు సహకరించాలన్నారు. నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

అచ్చంపేట: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన అచ్చంపేట, ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేటకు చెందిన జక్కులూరి అనూష(26) భర్త రాఘవల మధ్య గొడవ జరుగగా భార్యను బలంగా కొట్టడంతో ఆమె తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు భర్త రాఘవే స్వయంగా చల్లగరిగలోని మృతురాలి తల్లి రాజకుమారికి తెలియపరచాడు. వారికి ఇద్దరు పిల్లలు కాగా వారిని పాఠశాలలో చేర్పించే విషయంలో ఇరువురు గొడవ పడ్డట్లు సమాచారం. తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి కుమార్తె మృతి చెంది ఉండటాన్ని జీర్ణించుకోలేని తల్లి అల్లుడే తన కూతుర్ని పొట్టన పెట్టుకున్నాడంటూ అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి రాజకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లాషావలి తెలిపారు. మృతురాలి భర్త రాఘవను అదుపులోకి తీసుకున్నామన్నారు.

32 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు



గంజాయి స్వాధీన పర్చుకొని విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ సురేష్, సిబ్బంది

మాచర్ల రూరల్: 11 బ్యాగుల్లో 32 కిలోల గంజాయిని స్వాధీన పర్చుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని నాగార్జున సాగర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ కె.సురేష్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రా మీదుగా కర్ణాటక రాష్ట్రానికి గంజాయి తరలించేందుకు ముగ్గురు వ్యక్తులు కారులో నాగార్జునసాగర్ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీలు నిర్వహించగా వారి వద్ద 16 బ్యాగుల్లో 32 కేజీల గంజాయి గుర్తించామన్నారు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరంకు చెందిన మడకం రాంబాబు, బురగా రాజేశ్వరి, చోళంకి చంద్రశేఖర్‌లుగా గుర్తించామన్నారు. ఈ గంజాయిని చిత్తూరు జిల్లా మదనపల్లికి తరలించేందుకు వెళ్తుండగా పట్టుబడ్డట్లు చెప్పారు. దీని విలువ సుమారు రూ.3.20 లక్షలకు పైగా ఉంటుందని, ఈ ఘటనలో పట్టుబడ్డ వాహనాన్ని, గంజాయిని స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ సోమ్లానాయక్, సాంబనాయక్, విజయ్, సీతయ్య తదితరులున్నారు.

పోస్టాఫీసు ఎదుట బాధితుల ఆందోళన



పట్టణంలోని పోస్టాఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు

మాచర్ల రూరల్: తమ చిన్నారుల భవిష్యత్తు కోసం పోస్టాఫీసులో చిన్న మొత్తాల పొదుపులో జమ చేస్తున్న నగదును సొంతానికి వాడుకుని ఖాతాదారులను మోసం చేసిన ఉద్యోగిపై చర్య తీసుకుని నగదును తిరిగి ఇప్పించాలంటూ ఖాతాదారులు పోస్టాఫీసు ఎదుట నిరసన చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని కంభంపాడు గ్రామంలో పోస్టాఫీసులో వివిధ చిన్న మొత్తాల పొదుపు ఖాతాలలో, స్కీంలలో గత మూడు సంవత్సరాల నుంచి ఖాతాదారులు నెల నెలా జమ చేస్తున్నారు. ఇటీవల ఖాతాలలో నగదును ఆన్‌లైన్‌లో పరిశీలించగా జమ కానట్లు చూపించటంతో వారు అనుమానం వచ్చి పోస్టుమాస్టర్ కార్తీక్‌ను నిలదీయగా పుస్తకంలో స్టాంప్ వేసి సంతకం పెడుతున్నామని, డబ్బులు ఎక్కడకు వెళ్లవని, ఆన్‌లైన్ ప్రాబ్లం వలన కొంత సమయం పడుతుందని మాయమాటలతో కాలం గడిపారు. ఈ విషయంపై సత్తెనపల్లి హెడ్ పోస్టాఫీసుకు ఫిర్యాదు చేయగా ఎంక్వైరీ చేసి సదరు పోస్టు మాస్టర్ కార్తీక్‌ను గత ఏడాది విధుల నుంచి తొలగించారు. అయినప్పటికీ ఖాతాలలో నగదును జమ చేయకపోవటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. నగదును ఇప్పించి ఖాతాలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, వి.పెద నరసింహారావు, రంగారెడ్డి, సీహెచ్ హరి, నవ్య శ్రీ, లక్ష్మమ్మ, శ్రీలక్ష్మి, ఈశ్వరమ్మ, మంగమ్మ, నాగేంద్రం తదితరులున్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

యడ్లపాడు: పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని 50 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకళ్లను అందజేయాల్సి ఉంటుందని శుక్రవారం వెల్లడించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రొంపిచర్ల: మండలంలోని రైతులకు సరఫరా చేసేందుకు 408 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శివలలిత శుక్రవారం తెలిపారు. 50 శాతం రాయితీపై విత్తనాలను రైతులకు అందజేస్తామన్నారు. 235 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 107 క్వింటాళ్ల జనుము, 66 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జనుము, జీలుగ ఎకరాకు 10 కేజీల చొప్పున, పిల్లిపెసర విత్తనాలు 8 కేజీల చొప్పున అందజేస్తామన్నారు. రాయితీ పోను రైతు వాటాగా జనుము, జీలుగులకు కేజీకి రూ.44 చొప్పున, పిల్లి పెసరకు కేజీకి రూ.67 చొప్పున రైతు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా 5 ఎకరాల వరకు విత్తనాలు అందజేస్తామన్నారు. అవసరమైన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆర్‌బీకే కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో బహిరంగ వేలం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో సంత్రీ, చేపలు, కూరగాయల వ్యాపారాల నిమిత్తం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గిరికుమార్ శుక్రవారం తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2024 జూలై 01 నుంచి మార్చి 31, 2025 అర్ధరాత్రి 12 గంటల వరకు సంత్రీ, చేపలు ఇతర వ్యాపారాల నిమిత్తం బహిరంగ వేలం 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని ఆయన తెలిపారు. స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ కింద చెల్లించవలసిన అడ్వాన్స్ పాట మొత్తముపై 10 శాతం ముందుగా చెల్లించవలెనని తెలిపారు.

- కూరగాయల మార్కెట్.. ముందుగా చెల్లించవలసిన ధరావతు 2 లక్షలు దాఖలు చేయవలసిన ప్రాపర్టీ విలువ 3 లక్షలు
- సంత్రీ మార్కెట్.. ముందుగా చెల్లించవలిసిన ధరావతు రూ.3 లక్షలు ప్రాపర్టీ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విలువ రూ.5 లక్షలు
- చేపలు, మాంసం, కబేళా.. ముందుగా చెల్లించవలసిన ధరావతు రూ.50,000, ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ విలువ రూ.50,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పాట దారులు 22వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివారులోని గొట్టిముక్కల మేజర్ కాల్వ సమీపంలో శుక్రవారం రాత్రి మాచర్ల–గురజాల ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన జరిగింది. పిడుగురాళ్ల, కరాలపాడు గ్రామాలకు చెందిన సయ్యద్ వలి, సూర్యనారాయణాచారి ద్విచక్రవాహనంపై మాచర్లకు వెళ్లి తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సయ్యద్ వలి, సూర్యనారాయణాచారి ఇద్దరు తీవ్రంగా గాయపడగా వారిని 108 అంబులెన్స్ వాహనంలో గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే ఏఎస్ఐ హనుమంతురావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభాలపై విద్యుత్ తీగలు చోరీ!

యడ్లపాడు: కరెంటు సరఫరా ఉండి స్తంభాపై ఉన్న విద్యుత్ తీగలు చోరీ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామం నుంచి మైదవోలు వెళ్లే మార్గంలో ఎడమవైపున కనిపించే సాయి వెంచర్‌లో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... సాయి వెంచర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా 2020లో విద్యుత్ స్తంభాల్ని ఏర్పాటు చేసి 6 కిమీ పొడవైన విద్యుత్ తీగలతో 11 కేవీ, ఎల్‌టీ లైన్ నుంచి సరఫరా ఇచ్చారు. సదరు వెంచర్ ఊరికి వెలుపల ఉండటం, అక్కడి ప్లాట్లలో నివాసాలు ఏర్పరచుకోకపోవడంతో నిర్మానుష్యంగా ఉంటుంది. వాచ్‌మెన్ ఉన్నా పగలు మాత్రమే ఉండటం ఇవన్నీ బాగా పరిశీలించిన దుండగులు వెంచర్‌లోని విద్యుత్ స్తంభాలకు వెళ్లే మెయిన్ లైన్‌ను కర్రతో కొట్టి సరఫరాను బ్రేక్ చేసి అన్ని స్తంభాలపై ఉన్న అల్యూమినియం తీగల్ని ఊడ దీసుకుని ఉడాయించారు. ఈనెల 11వ తేదీ రాత్రి జరిగిన ఈ ఘటన గురించి వాచ్‌మెన్, పశువులు కాపర్లు గుర్తించి వెంచర్ యజమానికి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వెంచర్ యజమాని రాజవరపు కృష్ణ కుమారి విద్యుత్‌శాఖ అధికారులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని ఆశ్రయించారు. దీంతో యడ్లపాడు విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చోరీపై ఫిర్యాదు చేశారు. చోరీ అయిన తీగల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని దీనిని సీరియస్‌గా తమ డిపార్టుమెంట్ తీసుకుందని సాంబశివరావు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో సమయపాలన పాటించాలి

అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి శ్రీలత



అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రాజుపాలెం: మూడేళ్లు నిండిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి టి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సత్తెనపల్లి పరిధిలోని రాజుపాలెం, ముప్పాళ్ల, నకరికల్లు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి టి.శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని తెలిపారు. ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల హాజరును పెంచాలని తెలిపారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, బి.ప్రసన్నరాణి, ఎస్.స్వర్ణలత, ఎస్.నాగమణి, ఎం.అనంతలక్ష్మి, ఆర్.జయలక్ష్మి, షేక్ రమీజాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

17న గాయత్రీ మహాయజ్ఞం

ముప్పాళ్ళ: మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమంలో ఈ నెల 17వ తేదీన 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరుగుతుందని గాయత్రీ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. 16వ తేదీ ఆదివారం గ్రామంలో కలశముల శోభాయాత్ర, దీపయజ్ఞం జరుగుతుందన్నారు. 17వ తేదీన ఉదయం 10 గంటలకు 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్టూడెంట్ కిట్స్ పరిశీలన

నకరికల్లు: స్టూడెంట్ కిట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఈవో వేణుగోపాల్ సూచించారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో పంపిణీకి సిద్ధం చేసిన స్టూడెంట్ కిట్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 5,304 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు, సమదుస్తులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 ఎం.ఎల్.ఎన్ ప్రసాద్, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, సీవో అంజమ్మ, సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

22న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ప్రిన్స్‌పాల్ మేరీసూజన్

క్రోసూరు: క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 22న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీసూజన్ శుక్రవారం తెలిపారు. ఈ విషయమై ప్రిన్స్‌పాల్ తెలుపుతూ పాఠశాలలో చేరదలచుకున్న విద్యార్థులు ఈ నెల 18 నుంచి 21 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను మాత్రమే ప్రవేశ పరీక్షకు అనుమతించటం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరైయ్యే విద్యార్థులకు తాము చేరబోయో తరగతికి ముందు తరగతి సబ్జెక్టులలో ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్సులలో 20 మార్కుల చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 100 మార్కులకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా తరగతుల్లో సీట్లను విద్యార్థుల మెరిట్, రోస్టర్ విధానంలోనే భర్తీ చేయటం జరుగుతుందని ప్రిన్స్‌పాల్ వివరించారు. కావున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు మోడల్ స్కూల్ క్రోసూరు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.